



# చీకటి అంచుల్లోంచి..

## ఐ.వి.ఆర్. జైన్య చం దానంద్

"చూడయ్యా నిరుద్యోగీ! ఈ ప్రదేశంలో ఇంత రాత్రి వేళ ఈ రైలు కమ్మీలపై ఇలా కాపురం చేస్తున్న నిన్ను చూస్తే నా కెంతో సంతోషంగా ఉందయ్యా!" ఆ వ్యక్తి తన ఆనందాన్ని మాటల్లోనే వ్యక్తీకరించాడు.

నిరుద్యోగి తనువెల్లా ఆశ్చర్యాన్ని పులుముకొని చూశాడు ఆ శాల్తీ వైపు.

తన నిర్భాగ్యపు స్థితి చూసి జాలిపడడానికి బదులు సంతోషపడుతున్న ఆ శాల్తీ వైపు ప్రశ్నార్థకంగా, ఆశ్చర్యంగా మళ్ళీ మళ్ళీ చూశాడు నిరుద్యోగి.

"మీ రనేదేమిటో నా కర్థం కావటం లేదు. నన్ను చూస్తే మీ కెందుకంత సంతోషం?" చీకట్లో అస్పష్టంగా కనిపిస్తున్న ఆ అపరిచిత వ్యక్తిని పరికిస్తూ ప్రశ్నించాడు నిరుద్యోగి.

"వెదుకుతున్న తీగ కాలికి మెలిపెడితే సంతోషం కాకపోతే ఏడుపొస్తుం దటయ్యా, ఎవడికైనా?!" ఫక్కున నవ్వా డా ఆగంతుకుడు. "అది సరే, నిరుద్యోగీ! ఉద్యోగపర్వంలో నీ పాత్ర నిలువలేదా?" ప్రశ్నించా డా శాల్తీ గడుసుగా.

"లేకనేకదా ఈ అంతిమ యాత్రకు ప్రారంభోత్సవం?" నిరుద్యోగి మాటల్లో నైరాశ్యం తొంగి చూసింది.

"అయితే నీ ప్రారంభోత్సవానికి ముందు నా కో ఉపకారం చేసిపెట్టాలయ్యా." ఆ అపరిచితుని మాటల్లో ప్రార్థన ధ్వనించింది.

"నా జీవిత యాత్రలో ఏ ఒక్కడూ ఉపకారం చేసిన పాపాన పోలేదు. అలాంటిది నే నెందుకు చేయాలి?"

"బాబ్బాబూ! అందరి సంగతి నా కెందుకుకాని, నా విషయంలో మాత్రం నువ్వు కనికరించాలయ్యా!"

"నా వల్ల కాదు. మీ సహాయానికి మరో వ్యక్తిని ఎన్నుకోండి." నిరుద్యోగి నిక్కచ్చిగా చెప్పి డా నిష్ణయాన్ని.

"బాబూ, నిరుద్యోగీ! అంతమాట అనకు. అని— నన్నుమాత్రం అన్యాయం చేయకు. నీలాంటికేసు కోసం ఎన్ని రోజులబట్టో ఎదురుచూస్తున్నా. కాని, ఒక్కటీ తగిలి చావలేదు. ఇన్నాళ్ళకు దొరికిన నీ అమూల్యమైన కేసును వదిలేసుకుంటే నా జీవితమే వేస్ట్. బాబ్బాబూ! నీ కడుపున చ ... చ! మీ ఆవిడ

కడుపున పుడతా కాని, నాకుమాత్రం సహాయం చేస్తా నని ఒక్క మాట — ఒకే ఒక చిన్న మాట— అన వయ్యా, బాబూ! నీ పేరును రామకోటి రాసినట్లు రోజా రాస్తాను.''

ఆ అపరిచితుడు వాడిన రకరకాల కరుణ రస పూరిత పదాల తాకిడికి తట్టుకోలేక మైనంలా కరిగిన ఆ నిరుద్యోగి తన సహాయ నిరాకరణను విరమించుకుని సహాయానికి సిద్ధపడ్డాడు.

''అయితే నన్నేం చేయమంటారు?'' ఒక అయిదు అప్పుకాని అడగడు కదా అన్న సందేహం మనస్సులో పీకుతున్నా ప్రశ్నించాడు నిరుద్యోగి.

''సిద్ధ నాకు చేయవలసింది చాలా స్వల్పమైన సహాయం.''

''ఏమిటది?''

''నువ్వు ఇక్కడేనా రైలు క్రింద పడి చావా లనుకుంటున్నావు?''

''అవును.''

''మరి కాస్త ముందుకు — అంటే అదిగో, ఆ కనుపిస్తున్న ఎలక్ట్రిక్ పోల్ ఉంది చూశావూ— అక్కడ చస్తే చాలా బాగుంటుం దయ్యా!''

''అందువల్ల మీా కొచ్చే లాభ మేమిటి?'' సందేహ నివృత్తి కోసం అడిగాడు నిరుద్యోగి.

''లాభమంటే ఏమీలేదు. ఇప్పుడు నేను చూపించిన స్థలం వద్ద ఆత్మహత్య చేసుకున్నా ననుకో— తెల్లవారగానే ప్రజలు, పోలీసులు వస్తారు. ఎవరు చచ్చారు? ఎలా చచ్చారు? ఎందుకు చచ్చారు? ఆ చచ్చిన శవం ఆడా, మగా? ముసలా, ముతకా?— అన్న రకరకాల సంశయాలతో తల బద్దలు కొట్టు కుంటారు. ఆ చుట్టుపక్కల చిన్న కిళ్ళీబడ్డీకాని, ఒక చిన్న హోటల్‌కాని లేదు—ఒక్క నా హోటల్ తప్ప! దానికి ఆటాచ్ అయి ఒక చిన్న కిళ్ళీ బడ్డీకూడా ఉందనుకో. చాలా రోజుల బట్టి నా హోటల్ ఆదాయం పడిపోయింది. ఇక నీ మరణం వల్ల నా హోటల్‌కు గుర్తింపు ఏర్పడి కొత్త చైతన్యాన్ని పుంజుకుంటుందని నా ఆశ. అదయ్యా అసలు సంగతి.'' విశద పరిచాడు ఆ అపరిచితుడు.

కొన్ని క్షణాలు మౌనం ఆ నిరవ ని శిథిలా చిక్కగా పరుచుకొంది. కాష్ఠంలో శవం కాలిన తరవాత ఏర్పడే ప్రశాంతత. మళ్ళీ కొన్ని క్షణాల అనంతరం నిరుద్యోగి పొడి దగ్గు ఆ ప్రశాంతతను చెదర గొడుతూ—

''మీా కోసం ఆ ఎలెక్ట్రిక్ పోల్ వరకు ముందుకు నడవాలా? క్షమించండి. అది నావల్లకాదు. నా నర నరాల్లో నీరసం తప్ప మరొక అడుగు ముందుకు నడిపించే రసాయన శక్తి లేదు. మీాకు సహాయం చేసేందుకు నే నశక్తుణ్ణి.'' నిరుద్యోగి పెదాలపై నిర్లిప్తమైన నవ్వు, శబ్దంలేని నవ్వు, పేలవమైన నవ్వు పరుచుకుంది.

''చూడండి, నిరుద్యోగి గారూ! చచ్చేముందు మీారు చేసే ఈ అల్పమైన పుణ్యమే మీా పాపాల్ని హరిస్తుందని మాత్రం మరువకండి.'' హితబోధ చేయ చూశా డా వ్యక్తి.

''మీారు అరిచి గీపెట్టినా, అది నావల్ల కాని పని. చూడండి, అపరిచితుడు గారూ! ఇదిగో ఈ డిగ్రీ కాగితం పట్టుకుని తిరగని ఆఫీసంటూ లేదు. పలకరించని వ్యక్తి అంటూ లేదు. అయినా ఫలితం శూన్యం. ఎన్నో వందలు తగలేసి శారీరి కంగా, మానసికంగా శ్రమిస్తే దానికి రూపం ఈ కాగితం. నేను చదువురాని దద్దమ్మను కాను. చదువుకున్న దద్దమ్మను అని నిరూపించే ఈ కాగితం మటేడు నెలల నుండి సరిగ్గా ఒక్క పూటైనా కడుపునిండా తిండి పెట్ట లేకపోయింది. ఇక నా ఒంట్లో నిస్సత్తువ తప్పించి నన్ను మరొక అడుగు ముందుకు నడిపించే శక్తి ఏనాడో చచ్చి పోయింది.'' ఇక ఒక్క అడుగు కూడా వేయలేనట్లు నిరుద్యోగి నీరసంగా చెప్పేశాడు.

నిరుద్యోగి అభిప్రాయం విలువెల్లా కలవర పెట్టిన ఆశాల్తీ లబలబలాడాడు. అయినా పసే మిరా ఒప్పుకోలేదు నిరుద్యోగి.

''చూడండి! మీారెవరో, ఏమిటో నాకింత వరకు తెలియదు. అయినా ఇంకా స్పేపటో, చచ్చే వాడికి అనవసరం కూడా! కాని, అనవసరంగా నన్ను మీారు ఇబ్బంది పెడు తున్నారు. ఎందుకండీ, నానెత్తిని ఈ సహాయ ప్రశ్న? నేను మీాకేం అపకారం చేశాను? చచ్చేటప్పుడైనా కాస్త ప్రశాంతంగా చావనియ్యరెందుకయ్యా, అపరిచితుడు గారూ?!

''తమరెవరో కాని— ఇవిగో, ఈ చేతులు చూశారూ. వీటికి మిమ్మల్ని, మీ వంశవృక్ష శాఖల్ని నమస్కరించే ఓపిక లేక పోయినా, ప్రస్తుతానికి ఆ పని చేశాననుకుని కాస్త దయ వహించి, పోయే టప్పుడైనా కాస్త ప్రశాంతంగా పోనీయండి నన్ను. మళ్ళీ జన్మలో ఈ దేశంలో మాత్రం నిరుద్యోగిగా పుట్టకుండా ఏ లక్షాధి కారిగానో జన్మించి ఇప్పటి మీ ఋణం తీర్చేసు కుంటాను. కాని, మీారు ఇలాగే మరికొంత సేపు నాముందు గోల చేస్తే నా చావు పోస్ట్‌పోన్ చెయ్యవలసి వస్తుంది.'' బెదిరించారు నిరుద్యోగి.

''ఇదిగో, నిరుద్యోగీ! అనవసరంగా ఎందుకయ్యా ఆవేశ పడిపోతావు? నే నేమన్నానని అంతలా కోప్పడ తావు? నేను నిన్ను చావద్దని బలవంతం పెట్టా నటయ్యా? చావమనేగా నేనూ మనస్ఫూర్తిగా కోరేది? అలాంటిది పోస్ట్‌పోన్‌మెంట్ వూసెత్తుతావేం? ఎట్టి పరిస్థితిలో కాని, ఆ పుణ్య కార్యం చేసే ముందు ఒక చిన్న సహాయ కార్యంకూడా చేసెయ్య మని అర్థిస్తున్నానయ్యా!'' ఐదు పదులు నిండిన ఆ ఐక్క పలుచని శాల్తీ తన ప్రార్థనను ఒలికించాడు మళ్ళీ మాటల్లో.

''అబ్బె కుదరదండీ. నేను మాత్రం మరొక్క అడుగుకూడా ముందుకు వేయడం జరగదు.''

''ఎందుకు కదలవయ్యా? నీలో ఓపిక, నడిచే శక్తి లేదంటావు. అవునా?''

''నే ననడమేమిటి? ఉన్న మాటేగా?'' నీరసం నిరుద్యోగి మాటల్లోనే ధ్వనించింది.

''ఎలాగయ్యా? నీలో శక్తిని రప్పించటానికి నా వద్ద తినే పదార్థాలేమీా లేవు. ఎట్లా?'' ఆలోచ నలో పడ్డాడు ఆ శాల్తీ చుట్టుపక్కలు పరికిస్తూ.

నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా ఉన్న ఆ ప్రదేశం ఊరుకు కాస్త దూరంలో ఉంది. ఎత్తైన రైలు కమ్మెల మధ్య నిరుద్యోగి, కొంచెం దూరంలో ఆ శాల్తీ శిలా వి[illegible] కదలిక లేకుండా నిలు చున్నారు. కొని క్షణా అనంతరం ఆ ఐక్క పలచని శాల్తీలో క్రమం[illegible]క ఏర్పడింది.

''ఆ. . . వచ్చిందయ్యా మంచి ఆలోచన.''



మొహంలోని కాంతి చీకట్లో మెరిసింది.

"ఏమిటది?" నిరుద్యోగిలో నిర్లిప్తత.

లాల్చీ జేబులో చేయి పెట్టి ఏదో తీసి, నిరుద్యోగి కళ్ళ ముందు ఆడించి, "ఇదేమిటో బాగా చూసి చెప్పవోయ్" అని హుషారుగా అడిగాడు ఆ అపరిచితుడు.

కాంతివిహీనమైన నిరుద్యోగి కళ్ళు, మెరుపు లేని చూపులతో నిశితంగా చూసేందుకు ప్రయత్నించ సాగాయి ఆ శాస్త్రి చేతుల్లో ఉన్న వస్తువును.

రైలు కమ్మెల పక్కను అక్కడక్కడ చీకటి నీడల్లా నిలుచున్న ఎలక్ట్రిక్ స్తంభాల పైనుండి నియాన్ లైట్లు ఒలికే పలుచని కాంతి చుట్టు పక్కల్లో వ్యాపిస్తూండటం వల్ల ఆ సన్నని వెలుగులో నిరుద్యోగి కళ్ళు ఆ వస్తువును పసిగట్టాయి. పసిగట్టిన ఆ కళ్ళలో తళుక్కుమందొక మెరుపు.

"ఏమిటి పోల్చావ్, నిరుద్యోగీ?"

"...."

"చెప్పవోయ్"

"మీ చేతుల్లో ఉన్నది రూపాయి నోటు." వది పైసల మొహం చూసి ఎన్ని రోజులైందో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అన్నాడు నిరుద్యోగి.

"ఆ. ఇదయ్యా నిన్ను నడిపించే ఇంధనం. శవాల్ని సైతం మాట్లాడించే శక్తి ఈ ఒక్క ఇంధనానికే ఉందయ్యా ఈ రోజుల్లో. ఈ నోటు చూశావా? ఇది మనుష్యుల్ని సైతం పశువులుగా మారుస్తుంది. పశువుల్ని సైతం మనుష్యుల్నిచేస్తుంది. మనుష్యుల్ని యంత్రాలుగా నడిపించే ఈ ఇంధనం నిన్ను నడిపిస్తుందయ్యా ఇప్పుడు. ఇదిగో, దీన్ని నీ చేతులతో పట్టుకో. నువ్వు నడవాలని అనుకోక పోయినా నిన్ను నీకు తెలియకుండానే నీ అనుకున్న ప్రదేశం వరకు నడిపిస్తుంది. ఊ! ఇంద ఇది చేతిలోకి తీసుకో". ముందుకు చాచాడా శాస్త్రి.

యాంత్రికంగా చేయి చాచి, ఆ నోటును అందుకున్నాడు నిరుద్యోగి. అంతే. వేయి వోల్టుల విద్యుత్తు ఒక్కసారిగా శరీరంలోకి ప్రవహించిన షాక్, నరనరాల్లో ఏదో అనుభూతి ఆవిరి అయి, అద్వితీయమైన శక్తి ధమనుల్లోకి ఇంజక్టు చేస్తున్నంత పులకరింత. ప్రపంచాన్ని జయించినంత గర్వం. మనసు పొరల్లో ఏదో చేయాలన్న తపన. ఎక్కడికో పోవాలన్న ఆవేశం, ఆ రాటం.

"ఊ! ఇప్పుడు నడవవయ్యా ముందుకు. అదిగో, ఆ కనిపిస్తున్న ఎలెక్ట్రిక్ పోల్ చూశావా? అక్కడ ఆగి నీ జీవితానికి మంగళం పాడుకోవయ్యా. నీ పేరున రేపే దేవుడికి అర్చన చేసి, నీ పేరు పుట్టబోయే నా మనుమడికి పెట్టుకుని, నీ జన్మ చరితార్థం చేస్తానయ్యా. రేపటినుంచి నా దశ తిరగాలి. నా జీవితంలో కొత్తదనం పలకాలి. ఆ. నే చెప్పిన ప్రదేశం గుర్తుందా? ఇక రైలు వచ్చే వేళ అయింది. ఇంకాసేపట్లో వస్తుందయ్యా. ఇదిగో, నిరుద్యోగీ! భయపడకు. ధైర్యంగా నీ కార్యక్రమాన్ని కొనసాగించు. వస్తా నయ్యా. ఆ" అంటూ చెయ్యి ఊపి వెను దిరిగి రైలు కమ్మెలు దిగి, చీకట్లోకి నడిచాడు పరవదా ఆ అపరిచితుడు.

ఒక్కసారిగా గాలివాన వెలిసినట్లు అయింది ఆ అపరిచితుని తిరోగమనంతో. గడ్డకట్టిన నిశ్శబ్దంలో నిరుద్యోగి, శిలువ ఎక్కే ముందు వాడిలా తేజస్సుతో వెలిగి పోతున్నాడు. ఆ ప్రదేశం చుట్టుపక్కల చిక్కటి చీకటి అలుముకుని ఉంది. సన్నగా కీచురాళ్ల ధ్వని ఉండి ఉండి వినిపిస్తూంది. ఎత్తుగా పొడవుగా సాగిన రైలు పట్టాలకు ఇరువైపులా గుబురు పొదలు. అక్కడక్కడ తల విరబోసుకున్న చెట్లు. చీకట్లో ఆ నీలినీడలు భయాన్ని పుట్టిస్తున్నాయి.

నిరుద్యోగి అంతరంగంలో అవ్యక్త దృశ్యాలు సుడులు తిరిగే ఆలోచనలు. ఒక స్థిరం లేని భీభత్సం ముఖంలో ప్రస్ఫుట మవుతూంటే నీరసంగా ఉన్న దేహంలో వినూత్నమైన శక్తి ఏదో చేయమని, ముందుకు సాగమని ప్రోత్సహిస్తూంటే శిలలా నిలుచున్న నిరుద్యోగిలో చలనం ప్రారంభమైంది.

అడుగు తీసి అడుగు వేస్తున్నాడు నిరుద్యోగి. ఒకటి. రెండు. మూడు. ఇంకా. ఇంకా పడుతున్నాయి అడుగులు ముందుకు. ముందుకు. . .

చేరవలసిన ఎలెక్ట్రిక్ పోల్ దగ్గర అవుతూంటే ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఉత్తేజంగా ముందుకు ఉరుకుతున్నాయి అడుగులు. చేరవలసిన గమ్యస్థానం వచ్చేసింది దగ్గిరికి. ఒక్క క్షణం ఆగి, మళ్ళీ కదలిక. ఇప్పుడు ఎలెక్ట్రిక్ పోల్ వెనక్కు నడుస్తూంది.

నిరుద్యోగి ముందుకు నడుస్తూ అడుగులు వేస్తున్నాడు. క్రమం తప్పకుండా అడుగు తీసి అడుగు ముందుకు వేస్తున్నాడు. చీకటి మెట్లు ఒక్కొక్కటి ఎక్కుతూ, హెచ్చుకు పోతున్నాడు—చీకటి అంచుల్లోంచి వెలుగు రేఖలోకి.

*



శ్రీశైల — నంది విగ్రహాలు

ఫోటో : బి. సీతారామ్ (మహబూబ్‌నగర్)